19న 'టీ హబ్'లో 'టీ' అవార్డుల ప్రదానం



టీహబ్‌లో వివరాలను ప్రకటించిన 'టీ' ప్రతినిధుల బృందం

తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గం: తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ షో– 24 కార్యక్రమాన్ని ఈనెల 19న 'టీ హబ్'లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'టీ' ప్రతినిధులు ప్రకటించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సమావేశమయ్యారు. ఆర్టిస్ట్స్ అసోసియేసన్ అధ్యక్షుడు షారోన్ అమీర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొదటి నమోదిత కళాకారుల సంఘంగా 'టీ' గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో స్థానిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విభిన్న రంగాలకు చెందిన తెలంగాణ కళాకారులకు ఈనెల 19న అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డిజే పీయూష్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, జాయింట్ సెక్రెటరీ ఈషా హిండోచా, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులు నౌషబా ఫారూఖీ, జిబ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు రూ.7.80 కోట్లు..

'రెడ్' నోటీసులు జారీ

చర్యలకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధం



జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం

చందానగర్: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్– 21 వ్యాప్తంగా ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నోటీసులు జారీ చేసినప్పటికీ పలువురు బకాయిదారులు పన్ను చెల్లించకపోవడంతో కోట్లాది రూపాయలు జీహెచ్‌ఎంసీకి ఖజానాకు రావల్సినవి రాలేదు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్‌లోని ఆయా కాలనీలవాసులు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. దీంతో మొండి బకాయిలు పెరిగిపోతున్నాయి.

- రూ.5 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు 200 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు.
- రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 27 మంది ఉన్నారు.
- రూ.50 లక్షల పైబడి ఏడుగురు ఆస్తి పన్ను చెల్లింపుదారులు సుమారుగా రూ.3 కోట్లు బకాయిలు ఉన్నాయి.
- ఆస్తి పన్ను సకాలంలో చెల్లించండి.. జీహెచ్‌ఎంసీకి సహకారమందించండి అని అధికారులు అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టినప్పటికీ బకాయిదారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతి ఏటా మొండిబకాయిలు పెరిగిపోతున్నాయి. ఇందులో కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు ఉన్నాయి.

234 మందికి 'రెడ్' నోటీసులు..

- చందానగర్ సర్కిల్ పరిధిలో 234 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు రెడ్ నోటీసుల జారీకి రంగం సిద్ధం చేశారు.
- పన్ను వసూళ్లపై ఉన్నతాధికారుల ఒత్తిడి పెరగడంతో చర్యలకు సిద్ధమయ్యారు.

బకాయిలు వసూలు చేస్తాం..



చందానగర్ సర్కిల్ పరిధిలో మొండి బకాయిలు ఉన్నది వాస్తవమే. పలుమార్లు వారికి నోటీసులు జారీ చేశాం. ఆస్తి పన్ను బకాయిలలో కొంతమంది చెల్లించారు. మిగతా వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం.

–మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్– 21

హెచ్‌సీయూలో క్లీనప్‌డ్రైవ్



క్యాంపస్‌ను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను పరిశుభ్ర క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యమని హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలు, వ్యర్థాలు, చెత్తాచెదారంతోపాటు ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీమ్‌సింగ్, వాలంటీర్లు, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రీ మెచ్యూర్ బేబీలను కంటికి రెప్పలా కాపాడాలి: డాక్టర్ రవీందర్‌రెడ్డి

మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిలో ప్రీమెచ్యూరిటీ డే– 2024



కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు

మాదాపూర్: నెలలు నిండకుండా పుట్టిన పిల్లలని ఎదిగే క్రమంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలని నియోనాటాలజిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగే తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్‌లో ప్రీ మెచ్యూరిటీ డే– 2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండకుండా 23 నుంచి 37 వారాల లోపు పుట్టే పిల్లలందరినీ ప్రీమెచ్యూర్ అని 28 వారాలలోపు పుట్టే పిల్లలను ఎక్స్‌ట్రీమ్ ప్రీ మెచ్యూర్ బేబీస్ అంటారన్నారు. వీరు పుడుతూనే అనారోగ్య సమస్యలతో, ఎదిగే క్రమంలో అనేక రకాల సమస్యలకు లోనవుతారన్నారు. అనువభజ్ఞులైన డాక్టర్లను సంప్రదించి చికిత్స అందించాలన్నారు. మెడికవర్‌లో మిరాకిల్స్ ఎట్ మెడికవర్ థీమ్‌తో కార్యక్రమాన్ని వినూత్న పద్ధతిలో నిర్వహించినట్టు తెలిపారు. ఫుట్‌ప్రింట్ కవరేజ్‌లో చిన్నారుల పాద ముద్రలు, ఫొటోఫ్రేమ్ కార్నర్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, డాక్టర్లు నవిత, వంశీ, రాధిక, ఎస్వీ లక్ష్మీ, మధుమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు కరాటే నేర్చుకోవాలి



స్టేడియంలో పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి: ఆడపిల్లలు తైక్వాండో, కరాటే శిక్షణ పొందేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె శివసేనారెడ్డి సూచించారు. 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి అండ్ 13వ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీలను ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూ లాంటి క్రీడలు శారీరక ధారుఢ్యంతోపాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆయన సూచించారు.

జెమ్ మోటార్స్‌లో నటి ఇషారెబ్బ సందడి



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని జెమ్ మోటార్స్‌లో మారుతీ స్విఫ్ట్ కొత్త వేరియంట్‌ను నటి ఇషా రెబ్బ శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. సంస్థ సీఈఓ కల్పనా రావుతో కలిసి మాట్లాడుతూ కొత్త స్విఫ్ట్ కారు అత్యాధునిక ఫీచర్స్ కలిగి ఉందన్నారు. ఏడు సింగిల్ టోన్ కలర్స్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

గురునాథం చెరువు సుందరీకరణ షురూ



చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సెస్ మాల్స్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగా వార్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ, పునరుద్ధరణ పనులకు నిర్వాహకులు మల్లిగావార్డ్, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు, నెక్సెస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ...మియాపూర్‌లోని గురునాథం చెరువు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. మురికికూపంగా మారిన చెరువును మంచినీటి చెరువుగా మార్చుతామన్నారు. చెరువు అభివృద్ధికి ముందుకు వచ్చిన నెక్సెస్ సెలెక్ట్ మాల్స్, మల్లిగావార్డు ఫౌండేషన్‌ను అభినందించారు. చెరువు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, జీహెచ్‌ఎంసీ ఏఈ సంతోష్, సంస్థ ప్రతినిధులు రాం బొట్టా, చైతన్య, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి, కథక్ నృత్యాలు







అన్నమయ్యపురంలో స్వరార్చన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి, కథక్ నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కథక్ నాట్యగురువు సంజుక్త ఘోష్ శిష్యబృందం కథక్‌లో గురువందన, శివస్తోత్రం, శివతాండవం, జయంతిదేవి చాముండే అంశాలను ఆరాత్రిక,శ్రియ, యశస్వి, రిథమ్, నిషిక, వందన, శుభశ్రీ, శతాబ్ది తదితరులు ప్రదర్శించారు. కూచిపూడి నాట్యగురువు ఒగ్గ ప్రవీణ్ శిష్యబృందం తాండవ నృత్యకారి, జతిస్వరం, రామాయణశబ్దం, మరకత, మండూక శబ్దం, దశావతారశబ్దం, తిల్లాన తదితర అంశాలను అతిథి, తారా, కేయ, వేహ, రిష్య, శ్రీద, కృతి, పూర్వి, ఈషా, దీక్ష తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీమన్నారాయణ, పొడగంటిమయ్య, పరమ పురుష, కులుకక నడవరో, రామచంద్రుడితడు తదితర సంకీర్తనలు అనఘకృతి ఆలపించారు. మృదంగం సుధాకర్, వయొలిన్ పాలపర్తి ఆంజనేయులు సంగీత సహకారాన్ని అందించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

చందానగర్: మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్‌కి చెందిన వివి ఎన్‌ఎస్‌ఆర్‌కి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేలు చెక్కును శనివారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



రాయదుర్గం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సాంబశివారెడ్డి, హడ్కో జాయింట్ సెక్రటరీ, జాయింట్ జనరల్ మేనేజర్ ఆశిష్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రాములు, కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు స్వర్ణలత, దేవమణి, క్రాంతి, మమత, శ్రీనివాస, భాగ్యలక్ష్మి ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం జగద్రక్షక శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటలకు సంకల్పం, గణపతి హోమం, ఉదయం 9.00 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఏకశిలా పదునెట్టాంబడి పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయం మారుమోగింది. అయ్యప్ప స్వాములు వందలాదిగా తరలి వచ్చారు.

'కాంటినెంటల్'లో కిడ్స్ హెల్త్ కార్నివాల్



కాంటినెంటల్ ఆస్పత్రిలో కిడ్స్ కార్నివాల్‌లో పాల్గొన్న చిన్నారులు, వైద్యబృందం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

- పిల్లలకు ఉచిత వైద్యశిబిరం
- వేడుకల్లో పాల్గొన్న 200 మంది చిన్నారులు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శనివారం కిడ్స్ హెల్త్ కార్నివాల్ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్నివాల్‌ను ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి ప్రారంభించారు. 200 మంది చిన్నారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలురకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో భాగంగా ఫుడ్‌స్టాల్స్, హెల్దీ ఫుడ్ ఐటమ్స్ ఏర్పాటు చేశారు. ఆటపాటలతో చిన్నారులు ఎంజాయ్ చేశారు. డ్యాన్స్, మ్యూజిక్, డ్రాయింగ్ , వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు.అనంతరం డాక్టర్లు పిల్లలకు ప్రోటీన్స్, విటమిన్స్‌తో కూడిన ఆహారపదార్థాల గురించి, అవి తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే జంక్ ఫుడ్, చిరుతిండ్లతో వచ్చే వ్యాధులను వివరించారు. ఆస్పత్రి చైర్మన్ డా.గురు ఎన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు చదువు, మంచి సంస్కారం నేర్పించే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కె రన్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రణవ్ తేజ్, అక్రాంత్ దేవరకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. నడక, పరుగు జీవన శైలిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. 5కె, 2కె రన్‌లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణ, జనార్దన్ రెడ్డి, రామచంద్రం, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలపిట్ట ఎస్టీపీని సందర్శించిన ఈడీ

సాక్షి,సిటీబ్యూరో: కొత్తగూడలోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ శనివారం సందర్శించారు. ఎస్టీపీ పనితీరు, నిర్మాణ దశ, అందులో వాడే టెక్నాలజీ, మురుగు శుద్ధి ప్రక్రియలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 15 లోపు ఎస్టీపీ పనులను పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, ఎస్టీపీ సీజీఎం పద్మజ, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కూకట్‌పల్లి: మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. డ్రగ్స్ కంట్రోల్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల యువత నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యార్థులే లక్ష్యంగా కొంతమంది మత్తు పదార్థాలను అడ్డదారుల్లో స్కూలు, కాలేజీలకు సమీపంలో ఉన్న పాన్‌షాపుల్లో ఉంచి అమ్ముతున్నారని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్ రవీందర్‌రావు, ఎన్‌సీసీ అధికారి మేజర్ రత్నాజీ, పోలీస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు.శనివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సీపీఎం మహాసభలు మొదటిసారి సంగారెడ్డిలో జరుగుతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలకు తెలంగాణ వ్యాప్తంగా ముఖ్య నాయకులు, పోరాట యోధులు, ప్రజాప్రతినిధులు, కేంద్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. సభలలో రాష్ట్ర రాజకీయాలు, ప్రజల సమస్యలు, భవిష్యత్తు పోరాటాల గురించి చర్చిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, పటాన్‌చెరు ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, శేషగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'గుల్‌మొహర్'కు గుర్తింపు

గుల్‌మొహర్ పార్కుకు ఆర్‌డబ్ల్యూఏ ద్వారా జాతీయ అవార్డు అందజేత



వాకింగ్ ట్రాక్



కుందేళ్లు



అవార్డు అందుకుంటున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు (ఫైల్)




పార్కులో గ్రీనరీ

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ పరిధిలోని పార్కులలో ఉత్తమ పార్కుగా గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మొహర్ పార్కు గత కొన్నేళ్లుగా గుర్తింపు పొందింది. పల్లెటూరి వాతావరణం, ప్రశాంతతకు నిలయంగా మారిన గుల్‌మొహర్ పార్కును రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా గుర్తించి అవార్డు అందించారు. ఆర్‌డబ్ల్యూఏ ద్వారా గుర్తింపు పొందిన నేపథ్యంలో ఇటీవల గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ఆడిటోరియంలో జాతీయ స్థాయి సదస్సులో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాసీమ్, ప్రతినిధులకు అవార్డు అందించారు.

పచ్చదనం..ఆహ్లాదం..

- పార్కులో పచ్చదనం.. ఆహ్లాదంతో బాటు పక్షుల కిలకిలారావాలతో ప్రశాంత వాతావరణంతో అలరారుతోంది. పార్కులో రాతి సంపదను నేటికీ కాపాడడం విశేషం.
- మహనీయుల శిల్పాలు, పక్షుల బొమ్మలు, ఆకట్టుకుంటాయి. పార్కులో పావురాలు, బాతులు, కుందేళ్ళు, టర్కీ కోళ్లు, వివిధ రకాల కోళ్లతో సందడిగా ఉంటుంది. ఇక పచ్చదనం, నేలపైన వాకింగ్ చేసే అవకాశం ఉందని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుల్‌మొహర్ కాలనీలో 3.75 ఎకరాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు.
- రూ.3.50 లక్షలతో ఆవు దూడ, జిరాఫీ, జింకల ఫైబర్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. పార్కులో వాకర్స్ కోసం 800 మీటర్ల ప్రత్యేక వాకింగ్ ట్రాక్ ఉంది.వాకింగ్ ట్రాక్ తప్ప మిగతా అంతటా పచ్చదనం ఈ పార్కు ప్రత్యేకత.



అవార్డు రావడం సమష్టి కృషికి నిదర్శనం



గుల్‌మొహర్ కాలనీలోని పార్కుకు జాతీయస్థాయిలో అవార్డు రావడం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసుల సమష్టి కృషికి నిదర్శనం. ఆర్‌డబ్ల్యూఏ ద్వారా ఈ పార్కు నగరంలోనే అత్యుత్తమ పార్కులలో ఒకటిగా గుర్తింపు రావడం చాలా సంతోషం . అవార్డుతో మాపై మరింత బాధ్యత పెరిగింది.

–షేక్ ఖాసీమ్, అధ్యక్షుడు, గుల్‌మొహర్ పార్కు కాలనీ

అందరి కృషి ఫలితమే..



గుల్‌మొహర్ పార్కులో ప్రత్యేకతలు ఉన్నాయి. ఆహ్లాదపూరిత వాతావరణం, పచ్చదనం, పక్షుల కిలకిలరావాలు, ఆకట్టుకునే విగ్రహాలు, ఉన్నాయి. పార్కుకు జాతీయస్థాయిలో అవార్డు రావడం అందరి కృషి ఫలితమే.

– ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, కాలనీ అసోసియేషన్